# ప్రతిఫలం

శ్రీమతి ఘండికోట సావిత్రమ్మగారు.

"అక్కా! అమ్మ రాగానే, కాస్త చల్లగాలి తినడానికి షైరుపోదామా?" అంది జడవేస్తున్న అక్కతో శశి. "పోదాంలే! కదలకు ఎప్పుడూ తిరగాలనే ఉంటాయి కాళ్లు. అమ్మ ఎంతఅవస్థపడి వస్తుందో ఇంటికి, మనం ఇంటలేకపోతే ఎలాగు" అంది మాలతి. "పోనీలే! ఎప్పుడూ ఇంతే నీసంగతి, ఎక్కడికేనా వెళదామంటే చాలు వెనక్కి లాగుతావు. నీచక్కదనం ఎవరేనా కొరుక్కు తింటారనా" అని అక్క ముఖంలోనికి చూస్తూ కొంటెగా అంది శశి. మాలతి చెల్లిమాటలకి చిన్నగా నవ్వింది.

సాయంకాలం 5 గంటలైంది. ఖార్ఖానా పుంగా జోరుగా ఊదింది. తాయారమ్మ పనివదలి చకచకా నడిచి పోతూంది. ఇంటికి రాగానే ఇద్దరు పిల్లలు చిరునవ్వుతో స్వాగతమిచ్చారు.

"అమ్మా! నేనూ, అక్కా, కాస్తదూరం షైరు వెడతామే, ఎప్పుడూ ఇంటికాపలాయేనా," అంది శశి. తాయారమ్మ పెద్దపిల్లవైపు చూచింది. మాలతి తలదించేసుకుంది. "సరే! వెళ్లండి, వేగం వచ్చేయండి, కాలాలు బాగులేవు, తురకల అల్లరిజోరుగా ఉందట" అంది తాయారు.

అక్కా చెల్లెలు, చక్కగా ముస్తాబై, చెట్టాపట్టాలు వేసుకొని, వనకన్నియలు లాగ బయలుదేరారు తియ్యగా పాడుకొంటూ, ఆనందంతో సాగిపోతున్నారు.

తిన్నగాపోయి రైలువంతెన ప్రక్కనున్న బండపైని కూర్చున్నారు. వంతెనలో నుండినీరు జారుగా పారుతూంది. పిల్లలిద్దరూ పారుతున్న వాగులో, చిటితరంగాల్ని, గంగాభవాని మంజీరధ్వనులను మేళవించే గులకరాతి గలగలలు వింటూ యీకబురు ఆకబురు చెప్పుకుంటూ కూర్చున్నారు.

కొంతసేపటికి సూర్యుడు మెల్లగా జారిపోయాడు. అక్కచెల్లెళ్ల మాటలకి అంతమే లేకపోతూంది.

నీటిజోరుకి, ఎంతసేపటినుండి కొడుతుందో రాతికట్టు గోడని, ఒక్కసారిగా గుభీమని నీటిలో కూలిపోయింది. అక్కా చెల్లెలు త్రుళ్లిపడి బైటకి వచ్చారు. పట్టాలతోసహా నీటిలో పండుకున్నాయి ఒక్కమారుగా దూరంనుండి భూతంలాగ పెద్దలైట్లతో రైలు వచ్చేస్తుంది.

"అక్కా! చూశావా, రైలువచ్చేస్తుంది, వంతెన ఒక్కమారుగా కూలిపోయింది. ఎన్నిప్రాణులు ఇక్కడ బద్దలైపోతారో, ఏం చెయ్యడం!" అంది శశి.

"ముందుకిపోయి నా ఎర్రచెంగు ఊపుతాను, నువ్వు ఆపమని జోరుగాకేకవేయి." అంది మాలతి. ఇద్దరూ పరుగెత్తుకుంటూ, ఫర్లాంగుదూరం వచ్చారు. మాలతి ఎర్రచీర జెండాగా ఊపుతూంది. శశి జోరుగా కేకవేస్తుంది. దూరంనుండి లైటులో ఎర్రజెండా చూశాడు డ్రైవరు. తురక దుండగీండ్ర ప్రభావమేమో అని తలచి చేత రైఫిల్‌తో బ్రేక్ వేయడం మొదలు పెట్టేడు.

రైలు జోరు క్రమంగా తగ్గుతుంది. పిల్లల సంతోషం మరీహెచ్చౌతూంది. డ్రైవర్ కోపంగా, "రెచెడ్ గరల్స్ గెటవుట్," అంటూ, చీదరించుకొని ట్రిగ్గర్ లాగేడు. "అక్కా!" అంటూ పడిపోయింది శశి. మొర్రోమంటూ వంతెన దగ్గరకొచ్చి ఆగిందిరైలు. యీదృశ్యాన్ని చూడలేక, చవితి చంద్రుడు నీలిమబ్బులో దాగున్నాడు.